# విశాలాంధ్ర ప్రాంతీయం
## గుంటూరు, బాపట్ల, పల్నాడు

## యువతలో పెరిగిన మాదక ద్రవ్యాల వినియోగం

**విశాలాంధ్ర-గుంటూరు** : దేశంలో క్రీడలకు పెరుగుతున్న ఆదరణ, మౌలిక సదుపాయాలతో దేశం తరుపున పతకాల సాధన ఎక్కువగా పెరిగిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో.. క్రీడల ప్రాధాన్యత అంశాలపై ప్రసంగించారు. క్రీడలు టీమ్ స్పిరిట్ పెంపొందిస్తాయని, జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. కానీ దేశంలో యువతలో మాదకద్రవ్యాల వాడకం పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయని, 2017-2022 మధ్య గత ఐదేళ్లలో 10 రెట్లు పెరిగినట్లు వివరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని స్కాండినేవియన్ దేశాల ఉదాహరణను పేర్కొన్నారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడానికి క్రీడా కార్యకలాపాలలో పాల్గొనడానికి అట్టడుగు స్థాయి యువతను ప్రోత్సహించాలని ఆయన ప్రతిపాదించారు. దేశానికి పతకాలు సాధించడంపై ప్రభుత్వం దృష్టి సారించడంతో పాటుగా.. సామాజిక ప్రయోజనాల కోసం క్రీడలను ఉపయోగించుకోవాలని ఎంపీ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జొన్నాదుల జ్యోతి

**విశాలాంధ్ర-గుంటూరు** : కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంటూరుకు చెందిన జొన్నాదుల జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ బార్ అసోసియేషన్ హాలులో గురువారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు వల్లేబోయిన గురునాథం నియామకపత్రాన్ని జ్యోతికి అందజేశారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయపరమైన సమస్యలు పరిష్కరించి, పేదలకు కాంగ్రెస్ పార్టీ ద్వారా సేవ చేయాలని కోరారు. జొన్నాదుల జ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ యూత్ అధ్యక్షులు బొట్ల బ్రహ్మయ్య, ఓబీసీ డిపార్ట్‌మెంట్ జాయింట్ కోఆర్డినేటర్ వి.శ్రీనివాసరావు, బండ్ల వరుణ్, నగర సెక్రెటరీ బిజినేపల్లి రాము, విజయవాడ సిటీ నగర లీగల్ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో రైతు రక్షణ యాత్ర

**విశాలాంధ్ర-ప్రత్తిపాడు** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాల వలన వ్యవసాయం దుర్లభంగా మారిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి అన్నారు. స్థానిక ప్రత్తిపాడు నియోజవర్గ కేంద్రంలో రైతు రక్షణ యాత్ర పేరిట ప్రత్తిపాడు చమళ్ళమూడి, వట్టిచెరుకూరు మండలంలోని పలు గ్రామాలలో గురువారం పర్యటించారు. ఈ నెల 12వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని రైతులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజి, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్‌యూలో గణిత విభాగం 2వ అంతర్జాతీయ సదస్సు

**విశాలాంధ్ర-తాడేపల్లి** : కేఎల్ విశ్వవిద్యాలయంలోని గణిత విభాగం వారు రెండవ అంతర్జాతీయ సదస్సును ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం అధినేత డాక్టర్ బీవీ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ విదేశాల నుంచి గణిత శాస్త్రవేత్తలు, నిపుణులు, పరిశోధన విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. అందులో బాగంగా గణిత శాస్త్ర పరిశోధనలో వివిద దశలలో సాదించిన సుమారు వంద మంది గణిత నిపుణులు గణిత అభివృద్ధి ఇతర ఇంజనీరింగ్ విభాగాలలో రూపొందించిన పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం, సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ విభాగాల వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సు గణిత, ఇంజనీరింగు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

## చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన హిందూ ఫార్మసీ విద్యార్థినులు

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం** : ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వారు నిర్వహించిన అంతర కళాశాల మహిళా చెస్ పోటీల్లో హిందూ ఫార్మసీ కళాశాల 'ఫార్మా.డి విద్యార్థినులు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. అలాగే ఈ నెల 2,3 తేదీల్లో లాం చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా ఏఎన్‌యూ వారు నిర్వహించిన అంతర కళాశాల చెస్(మహిళలు)-20 టోర్నమెంట్‌లో ఫార్మా.డి నాలుగవ సంవత్సరం విద్యార్థిని ఎం.తులసి లక్ష్మి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన సాయి వర్ధిని, సూర్యతేజశ్రీ, చంద్రిక, గాయత్రి, రేణుకలను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ డాక్టర్ ఎస్.మధుసూధన రావులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, హెచ్ఓడీ జి.సదాశివరావు, ఫిజికల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ సీహెచ్ అజిత్‌బాబులు ఉన్నారు.

## విద్యార్థులు ఇతర రంగాల్లోనూ రాణించాలి

**విశాలాంధ్ర-తెనాలి** : విద్యార్థులు చదువు, ఆటలయందే కాకుండా ఇతర రంగాల్లో రాణించాలని ప్రిన్సిపల్ రాము అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం హైస్కూల్ నందు తెనాలి వేదికగా తెనాలి-రేపల్లె సబ్ జూనియర్స్ విభాగంలో 3,4,5తరగతుల విద్యార్థులకు ఇన్‌ట్రా డాన్స్ మీట్ నిర్వహించారు. భాష్యం విద్యా సంస్థలు వివిధ రంగాలలో భాగంగా ఇన్‌ట్రాడాన్స్ మీట్‌ను నిర్వహించగా ఇందులో 20జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గెలిచిన వారికి ప్రథమ, ద్వితీయ బహుతలను ప్రధానం చేశారు. ప్రథమ బహుమతి తెనాలి ఎ టీమ్, రేపల్లె బి టీమ్‌గా, ద్వితీయ బహుమతి తెనాలి బి టీమ్, రేపల్లె ఎ టీమ్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, జిగర్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# పాదయాత్రను అడ్డుకోవాలనుకోవడం దుర్మార్గం

- అడ్డంకులు సృష్టించినా యాత్ర జరిపి తీరుతాం
- రౌండ్ టేబుల్ సమావేశంలో జంగాల అజయ్‌కుమార్

**విశాలాంధ్ర-గుంటూరు** : కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం సీపీఐ చేసే పాదయాత్రను అడ్డుకోవాలనుకోవడం రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్టగా నిలిచిందని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో కడపలో పాదయాత్ర చేపడుతుంటే పోలీసులు అనుమతులు ఇవ్వకపోవడం అత్యంత దారుణమని అన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర జరిపి తీరుతామని స్పష్టం చేశారు. కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో విద్యార్థి, యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థుల బలిదానంతో వామపక్ష పార్టీల ఎమ్మెల్యేల పదవీ త్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా బీజేపీ ప్రభుత్వం పోస్కో కంపెనీకి అమ్మకానికి పెడితే రాష్ట్ర ముఖ్యమంత్రి కానీ, వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కానీ కనీసం నోరు కూడా మెదపలేదని మండిపడ్డారు. 2007 జూన్ 10వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారని, అనంతరం ఆయన చనిపోవడంతో ఫ్యాక్టరీ నిర్మాణం ఆగిపోయిందని అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో 2011 సంవత్సరం నుంచి ఉక్కు పరిశ్రమ కోసం ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని గుర్తుచేశారు. గత ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు కూడా 2019లో కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తానని చెప్పి శంకుస్థాపన చేయడం జరిగిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి మా నాన్న ఇచ్చిన మాట నెరవేర్చుకుంటానని చెప్పి కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించి తీరుతానని వాగ్దానం చేసి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ పనుల్లో ఎటువంటి పురోగతి లేదని అన్నారు. విభజన చట్టంలోని హామీల అమలుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ ఏర్పడితే ప్రత్యక్షంగా 28 వేల మందికి పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ఉక్కు పరిశ్రమ వల్ల ఒక్క కడప జిల్లాకే కాక రాష్ట్రవ్యాప్తంగా అనేకమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 13వ తేది వరకు ఉక్కు పరిశ్రమ కోసం కడపలో జరిగే పోరాట పాదయాత్రకు విద్యార్థులు, యువకులతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులు కాలరాస్తే సహించేది లేదని, ఇది పోలీసుల రాజ్యం కాదని... ప్రజాస్వామ్యమని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో పాదయాత్ర 9వ తేదీ కన్నతీర్థం నుంచి ప్రారంభమౌతుందని, అయితే పాదయాత్రకు అనుమతి కోరుతూ రాతపూర్వకంగా విన్నవించుకున్నా ఎందుకు అనుమతి ఇవ్వలేదో కారణాలు రాతపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ నగర అధ్యక్షులు షేక్ కరీం మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతి యుతంగా నిరసనలు, ప్రదర్శనలు చేపట్టే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఈ హక్కును కాల రాయటం ఏమిటని ప్రశ్నించారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణ కాంత్ మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రభుత్వం ఎక్కువ రోజులు పాలన సాగించలేదని, కడప ఉక్కు పరిశ్రమ కోసం ఇప్పటివరకు ముగ్గురు ముఖ్యమంత్రులు మూడు శిలాఫలకాలు మూడు పునాదిరాళ్లు వేశారే తప్పా ఏ ఒక్కరూ నిర్మాణ చర్యలు చేపట్టలేదని విమర్శిం చారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ ఎన్నికల ఆరు నెలల ముందు కాదు అధికారంలో వచ్చిన ఆరు నెలల లోపు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ఉక్కు పరిశ్రమ ఎక్కడుందో చూపించాలన్నారు. కేంద్రం మెడలు వంచి ఉక్కు పరిశ్రమ సాదిద్దామని చెప్పి ఇప్పుడు బీజేపీ విష కౌగిలిలో ఒదిగి బీజేపీ చేతిలో కీలుబొమ్మ అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి సీఫ్ మహమ్మద్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంత రావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, ముస్లిం ఐక్యవేదిక నాయకులు బాజీ కలాం, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంప్రసాద్, మంగా శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి, లీలా, బిల్లా నాని, వైఎఫ్ నాయకులు అరుణ్, రెహమాన్, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీ లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలి

**విశాలాంధ్ర-దుగ్గిరాల** : జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు చాలటం లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. మండల కేంద్రమైన దుగ్గిరాల తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ కె.కళ్యాణికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథులుగా మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్యలు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 31 లక్షల మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయడం జరిగిందని, కానీ రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది ఇళ్ళు నిర్మించుకోవడం జరిగిందన్నారు. ఇంటి స్థల లబ్ధిదారులకు రూ.1.80 లక్షలు ఇవ్వడం జరిగిందని, అవి చాలక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇచ్చిన స్థలాలు చూస్తే ఫౌండేషన్ కూడా వేయలేని పరిస్థితి నెలకొందన్నారు. మెటీరియల్ ఇచ్చి కొంత డబ్బులు ఇస్తానని చెప్పి ఇల్లు కట్టుకోమన్నారని, కానీ నేడు మెటీరియల్ ధరలు, కూలీ రేట్లు పెరిగిపోయి, సొంత ఇంటి కల నెరవేరాలంటే, ఇల్లు కట్టుకోవాలంటే ఆర్థిక భారం అయిపోయిందని లబ్ధిదారులు అంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేది నుంచి 10వ తేదీ వరకు తహశీల్దార్ కార్యాలయాల వద్ద లబ్ధిదారులతో ధర్నా చేయాలని పిలుపునిచ్చారని తెలియజేశారు. జగనన్న లబ్ధిదారులకు సొంత ఇంటి కల నెరవేరాలంటే రూ.5 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జాలాది జాన్ బాబు, యార్లగడ్డ శివయ్య, తుమ్మపూడి గ్రామ కార్యదర్శి షేక్ కరిముల్లా, అన్నవరపు ప్రభాకర్ రావు, కాబోతు ఈశ్వరరావు, నందం బ్రహ్మేశ్వం రావు, పి.మరియదాస్, జగనన్న లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు అన్ని విషయాలపై అవగాహన అవసరం

**విశాలాంధ్ర-తెనాలి** : మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మీ నారాయణ మారీసుపేట లోని నల్లమోత చెంచురామా నాయుడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులనుద్దేశించి ఎంఈవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాఠశాల బోధన, ఐఎంఎస్ హాజరు, జగనన్న గోరుముద్ద నిర్వహణ, జగనన్న విద్యా కానుక వంటి పలు అంశాలు అన్నింటి గురించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి అధికారులు పాఠశాలలను సందర్శించనున్న నేపథ్యంలో పాఠశాలలోని అన్ని విషయాల పట్ల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా అధికారులు పాఠశాల తనిఖీ చేసిన సమయంలో ఏ ఒక్కరూ ప్రధాన ఉపాధ్యాయులు అన్ని విషయాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ పేస్ ఆఫ్ ద్వారా ప్రతి ఒక్కరూ ఇన్ టైంలో వేయాలన్నారు. ప్రభుత్వం అందించే 2022-23విద్యా సంవత్సరంకు సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుండి పీహెచ్‌డీ పట్టా పొందిన తెనాలి ఎంఈవో మేకల లక్ష్మీనారాయణకు ఉపాధ్యాయులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అర్బన్, రూరల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

- నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం** : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని 16వ డివిజన్ అయిన ఏటుకూరులో నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులను తనిఖీ చేసి.. తీసుకోవాల్సిన చర్యలుపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించుటకు రాష్ట్రంలో నూతనంగా అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండలానికి ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మిస్తున్నారని, ప్రతి హెల్త్ సెంటర్లో 10బెడ్లు ఉంటాయన్నారు. శస్త్ర చికిత్సలు తప్ప మిగతా వైద్య సేవలన్నీ ఇక్కడ లభించనున్నాయన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఎక్సరేలు కూడా తీస్తారని, ఈ సౌకర్యం స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ వాసు, ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, యర్రంశెట్టి వేణు, నిశయంకరరావు నాగేశ్వరరావు, బోరుగడ్డ రజని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయి నుంచే 'అభ్యుదయ గీతాల'పై అవగాహన కల్పించాలి

- భారతీయ ప్రజానాట్య మండలి కార్యదర్శి గని

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం** : పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు 'అభ్యుదయ గీతాలు'పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ ప్రజానాట్య మండలి కార్యదర్శి గని తెలిపారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుంటూరు విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవంలో భాగంగా అరసం ఆధ్వర్యంలో అభ్యుదయ సాహితీవేత్త ముత్యాల ప్రసాద్ సాహితీ వేదికపై గురువారం సాయంత్రం 'అభ్యుదయ గీతాలు'అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గని మాట్లాడుతూ నైతిక విలువలు పడిపోయి మానవతా విలువ ప్రశ్నార్థకంగా మారిన ఈరోజుల్లో పసి పిల్లలను చెడగొట్టే అనేక అంశాలను టీవీల్లోనూ.. సెల్‌ఫోన్స్‌లోనూ... సినిమాల్లోనూ దుర్మార్గంగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నేడు మహిళలుపై జరుగుతున్న అత్యాచారాలు వర్ణనాతీతమని, నిన్నటి శ్రీలక్ష్మి మొదలుకుని నేటి తపస్వి వరకు రోజుకొకరు నేలకొరుగుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యార్థి దశ నుంచే పిల్లలకు పాఠశాలలో అభ్యుదయ గీతాలు నేర్పించడం.. అభ్యుదయ భావాలు వారిలో ప్రేరేపించడం.. పాఠశాల వార్షికోత్సవాలలో అశ్లీల నృత్యాలను పక్కనపెట్టి సామాజిక స్పృహతో కూడిన కళారూపాలను ప్రదర్శించాలని సూచించారు. కెఎల్‌పీ, భాష్యం, శ్రీశారద స్కూల్స్ విద్యార్థులు అభ్యుదయ గీతాల పోటీల్లో పాల్గొన్నారు. అరసం జిల్లా కార్యవర్గ సభ్యులు, యువ న్యాయవాది బుల్లా రవిబాబు గని, కొంతం నాగేశ్వరరావులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు తదితరులు ఉన్నారు.

## పొన్నూరులో చంద్రబాబు పర్యటనకు నిరసన సెగ



**విశాలాంధ్ర-పొన్నూరు** : పొన్నూరు పట్టణంలో గురువారం మాజీ ముఖ్య మంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పొన్నూరు పర్యటనలో నిరసనలు రేగాయి. టీడీపీ మాజీ శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమంలో భాగంగా బహిరంగ సభ ఏర్పాట్ల సన్నాహాలు చేస్తూ జీబీసీ రోడ్డులో తమ అధినాయకునికి స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయ కులతో సిద్ధమవుతుండగా స్థానిక వైసీపీ శ్రేణులు గో బ్యాక్ చంద్రబాబు అంటూ పెద్ద, పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలకు సర్ది చెప్పారు.

**IN THE HONORABLE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI**
**TRCMP NO: 380 of 2022**

Between:
Smt. Chinnam @ Naidu Anusha .... Petitioner
**AND**
Naidu Nikhil krishna .... Respondent

**1) Description of Petitioner:**
Smt. Chinnam @ Naidu Anusha, W/o. Naidu Nikhil Krishna, Age 29 years, R/o. Salipeta, Lakshmipuram Village, Challapalli Mandal, Krishna district.

**2) Description of Respondent:**
Naidu Nikhil Krishna, S/o. Jaya Mohan Rao, Age 31 years, R/o. D-No. 5-15-16/1, Railpet, 8th ward, Nidubrolu Village, Ponnuru Mandal, Guntur district, PIN : 522124.

Please take notice that in the above Petitoner filed TRCMP No. 380 of 2022 on the file of the "HONORABLE HIGH COURT" to order withdrawal and Transfer of D.O.P. No. 52 of 2022 on the file of Hon'ble Principal District Judge, Guntur and the same is Transfer to the Court of Principal District Judge, Machili patnam. On 06-12-2022 Honorable High Court directed to take out Substitute notice that Respondent have to appear either in person or through an Advocate in the above said Transfer Civil Misc petition on 15/12/2022 failing which the matter will be heard Ex-parte.

**( By order of the Honorable High Court of Andhra Pradesh At Amaravati )**

**Date of Hearing: 15/12/2022**

**Y. Koteswara Rao,**
**N. Rupeswara Reddy,**
Advocates, Flat No: 208, Block-B, Prime galaxy Apartments, Prakasham Barrage to Mangalagiri Road, Amaravathi, PIN: 522501, Cell No: 7386681854

Amaravathi
Date: 08-12-2022

## సింగపూర్ విశ్వవిద్యాలయంతో కేఎల్‌యూ అవగాహన ఒప్పందం

**విశాలాంధ్ర-తాడేపల్లి** : పరస్పర సహకారంతో విశ్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత మెరుగైన అవకాశాలను సృష్టించవచ్చునని కేఎల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ అన్నారు. గురువారం వడ్డేశ్వరంలో విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో సింగపూర్‌కు చెందిన నాన్యాంగ్ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో సమావేశం అనంతరం వారు అనేక అంశాలను పొందుపరిచిన అవగాహనా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కేఎల్ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్శిటీ (ఎన్‌టీయూ-సింగపూర్) డైరెక్టర్ డాక్టర్ బీవీఆర్ చౌదరి సందర్శించారు. కేఎల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ మాట్లాడుతూ అవగాహనా ఒప్పంద పత్రాలలో పొందుపరిచిన అంశాల గురించి వివరించారు. కేఎల్‌యూలో ఎంబీఏ ఎంచుకున్న విద్యార్థులు ఎన్‌టీయూలో కూడా ఒక సెమిస్టర్ లేదా ఒక సంవత్సరం పాటు విద్యను అభ్యసించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ ప్రొ.వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అంతర్జాతీయ సంబందాల డైరెక్టర్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సోషలిజానికి ప్రత్యామ్నాయం లేదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

**విశాలాంధ్ర-తాడేపల్లి** : సోషలిజానికి ప్రత్యమ్నాయం లేదని దాని కోసం పోరాటం చేయటమే లక్ష్యంగా మనందరం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం తాడేపల్లి సుందరయ్య నగర్ సీపీఎం కార్యాలయం వద్ద కె.ఉషారాణి అధ్యక్షతన ఆకురాతి విజయలక్ష్మి(జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్ సతీమణి) సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంస్కృతిక రంగాన్ని మతోన్మాదులు కలుషితం చేస్తున్నారని, దానికి భిన్నంగా ప్రత్యమ్నాయ సాంస్కృతికోద్యమాన్ని నిర్మిం చాలని అన్నారు. వృత్తి కళాకారుల సంఘంలో వచ్చిన పెడధోరణులు ఎదు ర్కొని సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న క్రమంలో జగన్ సతీ మణి విజయలక్ష్మి మృతి చెందటం బాదకరమని విజయలక్ష్మికి జోహర్లు అర్పించారు. ఈ సంస్మరణ సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, ప్రజాశక్తి ఎడిటర్ తులసీ దాస్, చీఫ్ జనరల్ మేనేజర్ అచ్యుతరావు, బుక్ హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సీపీఎం రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ అభ్యుదయ పాటల రచయిత దేవేందర్, కవులు, కళాకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, బంధువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత విజయలక్ష్మి చిత్రపటానికి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ, వివిధ జిల్లాల నుంచి వచ్చిన గాయకులు విజయలక్ష్మిని స్మరించుకుంటూ గీతాలు ఆలపించారు.

## నేటి నుంచి తాగునీటి సరఫరా యథాతథం

**విశాలాంధ్ర-గుంటూరు** : సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి నీటిని సరఫరా చేయు ప్రధాన పైప్‌లైన్లపై ఏర్పడిన లీకుల మరమత్తులు గురువారం పూర్తి అయ్యాయని, శుక్రవారం నుంచి నగరంలో తాగునీటి సరఫరా యధావిదిగా జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సంగం జాగర్లమూడి హెడ్ వాటర్ వర్క్స్ నుంచి నగరానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌పై ఏర్పడిన లీకుల మరమత్తులను ఇంజినీరింగ్ అధికారులు గురువారం పూర్తి చేశారని, నగరంలో 6, 7, 8, 9, 10, 11, 12 డివిజన్లలోని రైల్‌పేట, కొత్తపేట, సాంబశివపేట, గుంటూరు వారి తోట, పొత్తూరువారి తోట, రామిరెడ్డితోట, లాలాపేటలోని కొంత ప్రాంతం, పట్నంబజార్‌లోని కొంత ప్రాంతం, బాలజినగర్, ఎల్‌బీ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి యధావిధిగా సరఫరా జరుగుతుందని తెలిపారు.

## విద్యార్థులకు రాపిడ్ పరీక్షలు

**విశాలాంధ్ర-యడ్లపాడు** : మండల కేంద్రమైన యడ్లపాడు, గోపాలపురం ఎంపీపీ ప్రాథమిక పాఠశా లలోని ఒకటి రెండు తరగతుల విద్యార్థులకు గురువారం పైలేరియా ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వే నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో 23 మందికి నిర్వహించిన ఈ పరీక్షల్లో అందరికి నెగిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఈ పరీక్షలలో చిలకలూరిపేట నుంచి వచ్చిన వైద్య సిబ్బంది, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**యూనియన్ బ్యాంక్ Union Bank of India**

చంద్రమౌళినగర్ బ్రాంచి (పూర్వము యస్‌యమ్‌ఇ బ్రాంచి), డి.నెం.4-18-29, జెయస్ఆర్ హైట్స్, జెయస్ఆర్ రోడ్, డాన్‌బాస్కో స్కూల్ ఎదురు, 5వ & 6వ లైన్ల మధ్య, చంద్రమౌళినగర్, గుంటూరు. ఫోన్ : 0863-2355245

**ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 54/ 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము (SARFAESI ACT) డిమాండ్ నోటీసు**

From: చీఫ్‌మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చంద్రమౌళినగర్ బ్రాంచ్, గుంటూరు వారి నుండి యాక్ట్ 54 ఆఫ్ 2002 క్రింద

ఋణగ్రహీత : శ్రీ ఇనుదాబత్తుని కేశవరావు, 1-30-10, 5వ అంతస్థు, మహీంద్రా ఎన్‌క్లేవ్, యఫ్.నెం.1, 4వ లైను, యస్‌వియస్ కాలనీ, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్, ఇండియా, సహఅభ్యర్థి : శ్రీమతి ఇనుదాబత్తుని వెంకటేశ్వరమ్మ, భర్త : ఇ. కేశవరావు, 1-30-10, 5వ అంతస్థు, మహీంద్రా ఎన్‌క్లేవ్, యఫ్.నెం.1, 4వ లైను, యస్‌వియస్ కాలనీ, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్, ఇండియా, సహహామీదారు : శ్రీ గుంటుపల్లి మురళీమోహన్‌రావు, తండ్రి : పూర్ణచంద్రరావు, డి.నెం.3-28-48, 6వ లైను, 1వ అంతస్థు, బృందావన్‌గార్డెన్స్, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

అయ్యా / అమ్మా,
ఈ నోటీసులో ఉదహరించిన వ్యక్తుల హామీతో ఈ క్రింద ఉదహరించిన ఋణసౌకర్యము పూర్వము ఆంధ్రాబ్యాంక్, ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చంద్రమౌళినగర్ బ్రాంచి నుండి పొందియున్నారు.

| వ.నెం. | సౌకర్యము/ ఋణము | పరిమితి | అమలులో ఉండగా | ది.19-11-2022 నాటికి బకాయిసొమ్ము |
|---|---|---|---|---|
| 1 | హౌసింగ్ లోన్ - 103630100002272 | రూ.12,00,000/- | 2020-2021 | రూ.7,77,970.41 పై॥ |

తనఖావుంచబడిన ఆస్తి యొక్క వివరములు : కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు, యస్.నెం.2/2, డి.నెం.24-5 నందు "శ్రీ దుర్గా ఎన్‌క్లేవ్" రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ 2వ అంతస్థులో ఆర్‌సిసి ఫ్రేమ్డ్ స్ట్రక్చర్ ఫ్లాట్ నెం.యస్‌యఫ్2 కు చెందిన అవిభాజ్యపు భాగమైన 38.00 చ॥గ॥ల విస్తీర్ణముగల స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : యామిని చంద్ర యొక్క ఆస్తి యస్‌యఫ్1, పడమర : మెట్లు మరియు వరండా, ఉత్తరం : శూన్యాకాశము, దక్షిణం : శూన్యాకాశము. మొత్తం 243.66 చ॥గ॥ల విస్తీర్ణములో అవిభాజ్యపు భాగమైన 38.00 చ॥గ॥ల విస్తీర్ణము గల స్థలమునకు హద్దులు : తూర్పు : మారేడు నాగరాజు యొక్క ఆస్తి, పడమర : 21 అ॥ల వెడల్పుగల రోడ్డు, ఉత్తరం : కామినేని వెంకటనారాయణ మరియు ఇతరుల యొక్క ఆస్తి, దక్షిణం : కామినేని బాపూజి యొక్క ఆస్తి.

మీరు ఋణమును/ సౌకర్యమును మరియు/ లేదా వాయిదాలలో/ వడ్డీని/ఇండింటిని చెల్లించుటలో విఫలమైనందున ది.19-11-2022న మీ ఖాతాను ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం యన్‌పిఏగా వర్గీకరించబడినది మరియు మీరందరూ ఉమ్మడిగా మరియు విడివిడిగా ది.19-11-2022 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.7,77,970.41 పై॥ (అక్షరాల ఏడు లక్షల డెబ్బైఏడు వేల తొమ్మిది వందల డెబ్బై రూపాయలు మరియు నలభైఒక్క పైసలు మాత్రము) మరియు తదుపరి వడ్డీ చెల్లించవలసియున్నది. పైన ఉదహరించిన చట్టమునందలి సెక్షన్ 13(2) ప్రకారము దిగువ సంతకందారు ది.21-11-2022 న డిమాండ్ నోటీసు జారీచేసినారు. కాని అది తిరిగివచ్చినది / ముట్టనందున ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది. కావున మీ యావన్మందిని ఈ నోటీసు తేదీ నుండి 60 దినముల లోపల పైన నుదహరించిన మొత్తము మరియు వడ్డీ కలిపి చెల్లించవలసినదిగా కోరటమైనది. లేనియెడల బ్యాంకువారు బకాయి రాబట్టుకొను నిమిత్తము కోర్టువారి ప్రమేయములేకుండా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002 నందు ఈ క్రింద పేర్కొనబడిన వాటిలో ఒకటిగాని లేదా అంతకుమించిగాని చర్యలను తమ బ్యాంకుకు తనఖావుంచిన ఆస్తులపై తీసుకొనుట అనివార్యమౌతుంది.(1) ఋణగ్రహీత తనఖావుంచిన ఆస్తులను లీజుద్వారా గాని అద్దెకుఇచ్చుట ద్వారా గాని విక్రయించుట ద్వారా గాని బకాయి రాబట్టుకొనుటకు హక్కుభుక్తములతో స్వాధీనపరచుకొనుట. (2) ఋణగ్రహీత తనఖావుంచిన ఆస్తులను లీజుద్వారా గాని అద్దెకుఇచ్చుట ద్వారా గాని విక్రయించుట ద్వారా గాని బకాయి రాబట్టుకొనుటకు మేనేజిమెంట్‌ను స్వాధీనపరచుకొనుట. 3) ఈ ఆస్తుల అధికారమును స్వాధీనపరచుకొన్న పిమ్మట వ్యవహారము చూచుటకు వ్యాపార లావాదేవీలు నడుపుటకు ఎవరినో ఒకరిని నియమించుటము 4) అంతేకాకుండా ఈ ఆస్తులపై ఆసక్తిగల వ్యక్తులను, మీకు ఋణపడిఉన్నవారిని లేదా ఋణపడి ఉండబోవు వారిని ఆ మొత్తములను బ్యాంకుకు చెల్లించవలసినదిగా కోరవచ్చును. ఈ నోటీసు దరిమిలా తనఖావుంచిన పైనుదహరించిన ఆస్తులను బ్యాంకు వారి ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా విక్రయముద్వారా గాని లీజుకిచ్చుట లేదా ఇతరవిధములు గా గాని ఇతరులకు మీరు బదిలీచేయరాదు. ఈ ప్రక్రియలో అన్నివిధములైన ఖర్చులు మరియు అనుకోకుండా సంభవించు ఖర్చులు విక్రయార్జితములో నుండి సర్దుబాటుచేయబడును. ఒకవేళ విక్రయార్జితములు బ్యాంకువారి మొత్తము బకాయికి సరిపోనిచో 2002 సంవత్సరపు SARFAESI చట్టము 54 నందు ఉదహరించబడిన ప్రకారము నిల్వబాకీ వసూలు చేసుకొనుటకు తగిన చట్టబద్ధమైన చర్య తమ అందరిపై ఉమ్మడిగా మరియు విడివిడిగా తీసుకొనబడును. చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనల ప్రకారం తనఖావుంచబడిన ఆస్తుల యొక్క బహిరంగ వేలము నోటీసు ప్రచురణకు ముందుగా గాని లేదా కొటేషన్లు ఆహ్వానించుటకు ముందుగా గాని లేదా టెండర్లను ప్రజల నుండి లేదా ప్రైవేట్ వ్యక్తుల నుండి ఒప్పందాల మేరకు స్వీకరించుటకు ముందుగా గాని ఆస్తుల ను బదిలీ చేయుటకు ముందుగా గాని, లీజుకు ముందుగా గాని, కేటాయించుటకు ముందుగా గాని, అమ్మకమునకు ముందుగా గాని బ్యాంకు వారికి మీరు చెల్లించవలసిన బకాయిలు మరియు బ్యాంకు వారిచే చెల్లించబడిన అన్ని కాస్ట్‌లు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు కలుపుకొని చెల్లించినట్లయితే మీ ఆస్తులను విడిపించుకొను హక్కు కలదు. ఈ నోటీసు బ్యాంకువారికి ప్రస్తుతము అమలు లోనున్న ఇతర చట్టబద్ధమైన హక్కులకు భంగము వాటిల్లకుండా జారీచేయబడినది.

స్థలం : గుంటూరు
తేది : 08-12-2022

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వము ఆంధ్రాబ్యాంక్), చంద్రమౌళినగర్ బ్రాంచి, గుంటూరు.

## పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీస్ ఫుడ్‌కోర్ట్

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎస్పీ రవిశంకర్ రెడ్డి పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయించడం శుభపరిణామమని, నిరంతరం తమ సిబ్బంది సంక్షేమం కోసం ఆలోచించే అధికారి ఉండటం పోలీస్ సిబ్బంది అదృష్టమని కలెక్టర్ శివశంకర్ అన్నారు. ప్రస్తుతానికి ఈ ఫుడ్ కోర్ట్ పోలీస్ సిబ్బంది కోసం ఏర్పాటు చేయడం జరిగినదని, భవిష్యత్తులో తాము సమన్వయంతో సిబ్బందితో పాటు ప్రజలకు కూడా ఉపయోగపడే విధంగా ఉండేలా ఫుడ్ క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తామని అన్నారు. ఎస్పీ రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత కొన్ని వసతుల లేమితో సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి ఆరోగ్యకరంగా ఉండే విధంగా పరిశుభ్ర వాతావరణంలో అందరికి అందుబాటులో ఈ పోలీస్ ఫుడ్ కోర్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగినదని అన్నారు. ఈ పోలీస్ ఫుడ్ కోర్ట్‌ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో సిబ్బంది సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, అదనపు ఎస్పీ బిందు మాధవ్, రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాశిపాడులో 'ఇదేమి కర్మ మన రాష్ట్రానికి'

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండలంలోని కాశిపాడు గ్రామంలో గురువారం మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల, గ్రామాలలో పేరుకు పోయిన సమస్యలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, షేక్ అజీమల్లా, షేక్ ముంతాజ్, పాటిమండ్ల శివమ్మ, మల్లెల నరసయ్య, శివయ్య, సంజీవరావు, మోహన్ రావు, వెల్లలచెరువు సురేష్, తెలుగు మహిళ కుమారి, చిట్టిబాబు, హృదయ రాజు, గ్రామ సర్పంచ్ గొర్రె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో జీవీ ఆంజనేయులు

విశాలాంధ్ర-వినుకొండ : బంజారా పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ ఆరాధన వేడుకలలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, వినుకొండ మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామేలుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల పరిధిలోని బలుసుపాడు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త నందిగం సామేలు అనారోగ్యంతో మృతి చెందగా వారి పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సామేలు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యకమంలో ఎంపీపీ బి.మిరయ్య, ఎంపీటీసీ రాయవరపు ఉమామహేశ్వరరావు, నలామేకల సురేంద్ర, బచ్చు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు రక్షణ కోసమే జీపు యాత్ర

**సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్**

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు రక్షణ కోసం, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేది నుంచి 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు రైతు రక్షణ జీపు యాత్ర కొనసాగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్ నుంచి గురువారం ప్రారంభమైన రైతు రక్షణ జీపు యాత్రను జంగాల అజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, రుణమాఫీ, విద్యుత్ మీటర్ల రద్దు, స్వామినాథన్ సిఫార్సు ప్రకారం పంటలకు మద్దతు ధరలు, భారీ వర్షాల వల్ల నష్టపోయిన, కల్తీ విత్తనాల వల్ల, అల్పవర్షపాతం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యం లో ధర్నా నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ ధర్నాలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ యాత్రకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, జిల్లా సహాయ కార్యదర్శి కంజుల విఠల్ రెడ్డి నాయకత్వం వహిస్తారని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు, గుంటూరు నగర కార్యదర్శి చెవుల పున్నయ్య కళాబృందం పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, ప్రజానాట్యమండలి బృంద సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులు పనిచేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : గ్రామంలో తాగునీటి సమస్య, కరెంటు సమస్య, డ్రైనేజ్ సమస్య ఇలా ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అవసరమైన నిధులను సమకూర్చే దిశగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో మాట్లాడి నిధులు మంజూరు చేపిస్తామని సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మీరయ్య అన్నారు. ఈ సందర్భంగా పెద్దకూరపాడు ఎంపీటీసీ 3 కంచర్ల నిర్మల గోవిందరావు మాట్లాడుతూ ఆనందపేటలో జల జీవన్ పథకం ద్వారా చేపట్టిన పనులకు గుంతలు అలాగే ఉన్నాయని తద్వారా ప్రజలు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్తంభాలు మార్చమని ఎమ్మెల్యే ద్వారా కరెంటు ఏఈకి తెలిపినప్పటికీ మూడు నెలలైనా ఒక్క స్తంభం మార్చలేదని ఏఈపై మండిపడ్డారు. అనంతరం పలు శాఖల అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, డిప్యూటీ తహశీల్దార్, సీడీపీఓ, ఈఓఆర్డీ, పీఆర్ ఏఈ, హౌసింగ్ ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ, ఆర్ అండ్ బి ఏఈ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## 'నాడు-నేడు' అమలులో పల్నాడుకు ప్రథమ స్థానం

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్ : పల్నాడు జిల్లా నాడు-నేడు పథకం అమలులో రాష్ట్ర స్థాయిలో అగ్ర స్థానం దక్కించుకుందని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ప్రకటించారు. నూతన విద్యా విధానం జిల్లాలో తప్పని సరిగా అమలు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నాడు-నేడు పథకం ద్వారా అమలు అవుతున్న విద్యా శాఖ పనులు, విద్యా విధానం అమలు తదితర అంశాలలో జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరింతగా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వచ్చిన 5040 ట్యాబ్‌లను పల్నాడు జిల్లాలోని 28 మండలాలకు వీటిని జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఒక్కో మండలానికి 180 ట్యాబ్‌లను పంపిణీ చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. పల్నాడు కలెక్టరేట్‌లో ట్యాబ్‌ల్లో 'బైజూస్ యాప్'ను జిల్లా కలెక్టర్ ఇన్‌స్టాల్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక లయోల హైస్కూల్ వినుకొండలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం అండర్-14 అండర్-17 బాలుర విభాగంలో బాస్కెట్ బాల్ గేమ్‌లో గుంటూరు జిల్లా జట్ల ఎంపికలు జరిగినాయి. ఈ ఎంపికలు కార్యక్రమమునకు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వినుకొండ మండల ఎంపీపీ పగడాల వెంకటరామిరెడ్డి, క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారని స్కూల్ గేమ్స్ వినుకొండ నియోజకవర్గం కోఆర్డినేటర్ బీరెళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఎంపికలకు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సిహెచ్ కోటేశ్వరరావు వచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్లటూరు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, పీఈటీ, పీడీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఖాదర్ మస్తాన్, సెక్రెటరీ బీఐ స్వర్ణ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కే బాజీ, కె.రాజేష్, వినుకొండ జోన్ పీడీలు ఆర్.రాధాకృష్ణ మూర్తి, జి.బాల భాస్కర్, ఎంవీ సుబ్బారావు, అనురాధ, రూత్‌మేరి, శైలజ, బాస్కెట్ బాల్ సెలక్టర్ కోటిరెడ్డిలు అండర్-14, అండర్-17 బాలురు విభాగంలో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు జనవరిలో నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, ఏఎంజీ రాజు, జి.వీరాంజనేయులు, సుధారాణి, కె.ఏసు రాజు, బాజీ, అంకారావు సుధారాణి, వెంకటరత్నం, నరసింహారావు, పాపారావు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర-శావల్యాపురం : మూడున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒనగూరింది శూన్యమని, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. మండలంలోని వేల్పూరు, ఇర్లపాడు గ్రామాలలో టీడీపీ ఆధ్వర్యంలో గురువారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ఎండగట్టారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, పారా వెంకటేశ్వర్లు చౌదరి, సాదినేని కృష్ణమూర్తి, ఎగినాటి తిరుపతిరావు, బొల్లా ప్రసాదు, పావులూరి శ్రీనివాసరావు, సూరాబత్తుని నాగేశ్వరరావు, సూరాబత్తుని శ్రీరాములు, జుంజు యోహాను తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర-దుర్గి : పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక ప్రకారం సెక్రటరీలు పనులు చేపట్టాలని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ అన్నారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం 2023-24 ఆర్థిక సంవత్సరమునకు గ్రామ స్థాయి పంచాయతీ రాజ్ అభివృద్ధి ప్రణాళికలు తయారీలో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై కార్యదర్శులకు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మొదటి రోజు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలం నుంచి ఐదుగురు గ్రేడ్-5 సెక్రటరీలు నర్సరావుపేటలో శిక్షణ పొంది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. సాయి మణికంఠ, సత్యనారాయణ, దుర్గారావు, మున్నీరులు ముటుకూరు, కంచరగుంట్ల, నెహ్రూనగర్ పంచాయతీ పరిధిలోని సెక్రటరీ, సర్పంచ్, ఎంపీటీసీ, సచివాలయ సిబ్బందికి, మండలస్థాయి అధికారులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, సుస్థిర అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీకీ ఉన్న ఆదాయాన్ని బట్టి నిష్పత్తి ప్రకారం అభివృద్ధి పనులకు ఉయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా, ఎపీఓ చిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలోని మంచికల్లులో గురువారం పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల ఘనంగా జరి గింది. గత నెల 27 నుంచి ఉత్సవాలను ఆరంభించారు. ప్రతి రోజు వరుసగా శక్తిని నిలుపుట, శక్తిని సాగనంపుట, బియ్యం కోల, పుట్ట బంగారం, శక్తుల యాగం, జలబిందెలు వేడుకలు ఏర్పాటు చేశారు. గురువారం శిడిమాను ఊరేగింపు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కులు భక్తులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంఘిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ కమిటీ చేపట్టింది. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు తోరణాలతో తీర్చిదిద్దారు. మాచర్ల వైసీపీ నేత పిన్నెల్లి వెంకట రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. శిడిమాను ఊరేగింపు సందర్భంగా ఎస్సై సమీర్ భాషా ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం కుంతము బండ్ల ఊరేగింపు, శనివారం దీవెన బండారుతో ఉత్సవాలు ముగిస్తారు.

## హ్యుమన్ ఎక్సలెన్స్ నేషనల్ అవార్డుకు ఎంపికైన డాక్టర్ గోదా రమేష్

విశాలాంధ్ర-రొంపిచర్ల : పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్‌కు ది అమెరికన్ యూనివర్సిటీ వారు ఈ నెల 10వ తేదీన ఇండియా కు విచ్చేసి అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవమును పురస్కరించుకొని మానవ హక్కుల పరిరక్షణకు అలుపెరగని పోరాటం చేస్తున్న ఉద్యమ పోరాట యోధులకు అందజేస్తున్న ఈ అవార్డు డాక్టర్ గోదా రమేష్ కుమార్‌కు ఈ నెల 10వ తేదీన ది అమెరికన్ యూనివర్సిటీ ప్రతినిధులచే విజయవాడలోని హోటల్ ఐలాపురం వేదికగా అందుకోనున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి ఏపీపీఎస్సీ శాఖ పరీక్షలు

**- డీఆర్వో లక్ష్మిశివజ్యోతి**

విశాలాంధ్ర - బాపట్ల : నేటి నుండి జిల్లాలో జరగనున్న ఏపీపీఎస్సీ శాఖా పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవిన్యూ అధికారి లక్ష్మిశివజ్యోతి తెలిపారు. ఈ మేరకు గురువారం అధికారులతో తన ఛాంబర్‌లో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 1983 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. వేటపాలెం మండలం సేంట్‌ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, మద్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటల లోపు పరీక్షా కేంద్రానికి రావాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రం వద్ద నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్తు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో పరీక్షల పర్యవేక్షకులు ఐ.పద్మావతి,వి.వి.ఎస్ భవాని, వేటపాలెం డిప్యూటీ తహసీల్దార్ జి.మహేశ్వరి, కలెక్టరేట్ పరిపాలనాధికారి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - నిజాంపట్నం : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వైసీపీ నాయకులు మోపిదేవి హరినాథ్ బాబు, జెడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య అన్నారు. మండలంలోని పల్లపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ నూతన భవనం నిర్మాణానికి గురువారం వారు శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృధే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని అందుకు గాను గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగుల వెంకట రత్న ప్రసాద్, కూచినపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పందర బోయిన బసవపున్నరావు, ఎంపీటీసీ సభ్యులు నాజర్ ఖాన్, పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

## కార్యకర్తలు భారీగా తరలిరావాలి

**- పార్టీ కన్వీనర్ అప్జల్ పిలుపు**

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ నరేంద్రవర్మ ఆదేశాల మేరకు బాపట్లలో చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు మండల పరిధిలోని టీడీపీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని మండల టీడీపీ అధ్యక్షుడు అప్జల్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం నేతలతో కలిసి గ్రామాల్లో పర్యటించి జనసమీకరణకు కసరత్తు చేశారు. బూత్‌స్థాయి కన్వీనర్లతో సమావేశమై సభ విజయవంతానికి చర్చించారు. గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తప్పక పాల్గొని చంద్రబాబు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు

విశాలాంధ్ర-మంగళగిరి : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారానే ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల డైరెక్టర్ వైవీ కృష్ణారావు పేర్కొన్నారు. మంగళగిరి మండలం ఖాజా గ్రామంలో పాఠశాల భవన ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

# జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

- రాష్ట్రానికి జగన్ శని పట్టింది.. విముక్తి కలిగిద్దాం
- మీ అండ ఉంటే జగన్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తా
- చంద్రబాబు

విశాలాంధ్ర-పొన్నూరు : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేశారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడు చేపట్టిన రోడ్ షో కార్యక్రమం గురువారం మధ్యాహ్నం పొన్నూరు నియోజకవర్గం పరిధిలోని పెదకాకాని వై జంక్షన్ నుంచి ప్రారంభమై బుడంపాడు, నారాకోడూరు, చేబ్రోలు, మంచాల, వెల్లలూరు, బ్రాహ్మణ కోడూరు, మునిపల్లె, పచ్చలతాడిపర్రు మీదుగా పొన్నూరు పట్టణానికి పాదయాత్ర చేరుకుంది. స్థానిక ఎన్టీరంగా విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పొన్నూరుకి రావటం కొత్త ఏమీ కాదని పొన్నూరు ప్రాంతంలో 30 ఏళ్లుగా ధూళిపాళ్ల కుటుంబం సుపరిపాలనను అందించారని ఆయన కొనియాడారు. ప్రస్తుతం అన్ని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కరెంటు, డీజిల్ ధరలు పెరగడంతో పాటు చెత్త మీద పన్ను వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పది రూపాయలు ఇచ్చి వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వమని అన్నారు. రాష్ట్రానికి జగన్ శని పట్టిందని రాష్ట్రం సర్వనాశనం అవుతుందని ప్రస్తుతం కోలుకోలేని పరిస్థితిలో ఉన్నదని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తాను పాదయాత్ర చేస్తూ ఉంటే తనపై దాడి చేస్తున్న వారిని పది మందిని కంట్రోల్ చేయలేని పోలీసులు బందిపోట్లను ఎలా పట్టుకుంటారని ఏ విధంగా ప్రజలకు న్యాయం చేస్తారని విమర్శించారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని ఎవరిని వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. అమూల్ సంస్థకు ఆస్తులు కట్టబెట్టి రైతులు రూపాయి రూపాయి కూడ పెట్టుకున్న సంగం డెయిరీని నిర్వీర్యం చేసేందుకు జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కుయత్నాలను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. జగన్‌మోహన్ రెడ్డికి లక్ష మంది పోలీసులు అండగా ఉంటే తనకు ఐదు కోట్ల మంది ప్రజలు అండ ఉన్నారని అన్నారు. వారు తనకు ఉన్నంతకాలం జగన్‌మోహన్ రెడ్డి తనపై ఎన్ని కేసులు పెట్టినా ఏమి చేయలేడని అన్నారు. బీసీలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని వారి డీఎన్ఏలో టీడీపీ మాత్రమే ఉంటుందన్నారు. బీసీలకు జగన్‌మోహన్ రెడ్డి చేసింది ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. బీసీ నాయకులు సైతం ఇదేం ఖర్మ రా బాబు అని వైసీపీ చేపట్టిన బీసీ సభ నుంచి బయటికి వచ్చేసారని, బీసీలు ఎల్లప్పుడూ తమ పార్టీతోనే ఉంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న కాలంలో మీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, సైకో జగన్‌కు రాత్రికి నిద్ర రాదని ఆయన అన్నారు. అన్నా క్యాంటీన్లు ఏమి చేశాయని వాటిని ఎత్తేసావ్ అని ఆయన నిలదీశారు. తాను పెట్టిన సంక్రాంతి కానుక, విదేశీ విద్య, రంజాన్ తోఫా, షాదీ ముబారక్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పథకాలను ఎత్తేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. బటన్ నొక్కి అన్ని పథకాలు చేస్తున్నానన్న జగన్ ప్రజలకు చేసిందేమీ లేదని, సాయంత్రం బటన్ నొక్కి అన్ని కమిషన్లు కొట్టేస్తున్నారని దీన్ని ఊరుకునేది లేదని తాను అధికారంలోకి రాగానే అన్ని కక్కిస్తానని ఆయన హెచ్చరించారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మట్టి, ఇసుక, వ్యాపారులు, ఉద్యోగులు వద్ద కమిషన్లు తీసుకొని పట్టణ ప్రజలకు మోసం చేస్తున్నారని, కిలారి చిట్టా తమ దగ్గర ఉన్నదని వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన స్థానిక మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సిద్ధాంతపరంగా రాజీలేని పోరాటం సాగిస్తానన్నారు. ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న తమకు మీరు ఇచ్చిన అండ మర్చిపోలేనిది అన్నారు. రేషన్ మైనింగ్ డబ్బు ఉంటేనే ఇక్కడ పనులు జరిగే పరిస్థితి ఉందని దాన్ని ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బుర్రు రామారావు, అహ్మద్ ఖాన్, షేక్ బాజీ సాహెబ్, చిన్న, బండ్లమూడి బాబురావు, హరిబాబు, ఫిరోజ్ ఖాన్, ఎద్దు సోంబాబు, ఆకుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ ఈ-కేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : పీఎం కిసాన్ నగదు రైతుల ఖాతాలలో జమ అవ్వాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. గురువారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన శాఖ పరమైన రివ్యూ సమావేశానికి ముఖ్య అతిథిగా అయన హాజరైన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ కి సంబందించిన వరి ధాన్యం నూర్చిన వెంటనే రైతులు ఆర్బీకేల ద్వారా ప్రోకర్మెంట్ సెంటర్ ద్వారా గిట్టు బాటు ధరకు అమ్ముకోవాలని సూచించారు.తుఫాన్ హెచ్చరికలు ఉన్న కారణంగా రైతులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి వాగొలు బుష్ మాట్లాడుతూ ఆర్బీకే లలో మినుములు, పెసలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకావాలని కోరారు.గ్రామాల్లో విఏఏలు, ఎంపీఈఓలు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఏఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

## యోగాసన పోటీల్లో సత్తా చాటిన ఐలవరం విద్యార్థులు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగాసన పోటీలలో ప్రతిభను కనబరచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలలోని వివిధ పాఠశాలలోని 300 మంది విద్యార్థులు పాల్గొన్న జిల్లా స్థాయి యోగాసన పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరచినట్లు చెప్పారు. నకిరేకల్ మండలం కండ్ల కుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఎఓ జరిగిన పోటీలలో అండర్ - 14 యోగాసన పోటీలలో తమ పాఠశాలకు చెందిన కౌతరపు సంపత్, చింత్కుంత డోలా పూర్ణచంద్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపిక కాబడిన విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పిడి శ్రీనివాసరెడ్డి, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## నేడు బాపట్లకు చంద్రబాబు రాక

**- విస్తృత ఏర్పాట్లు చేసిన నరేంద్రవర్మ**

**- బాబు ప్రసంగంపై సర్వత్ర ఉత్కంఠ**

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : టిడిపి అధినేత చంద్రబాబు నేడు బాపట్లలో పర్యటించ నున్నారు. వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్య మైందని, నిత్యావసర ధరలు పెరిగిపోయి సామాన్యులు బతకడమే కష్టంగా మారిందని ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పేరుతో భారీ బహిరంగ సభలో ప్రసంగించ నున్నారు. పొన్నూరు నుండి మధ్యాహ్నం రోడ్‌షోలో బయలు దేరి బాపట్ల మండలం చుండూరుపల్లి, ఈతేరు, అప్పికట్ల మీదగా పట్టణంలోకి చేరుకుంటారు. చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు టీడీపీ ఇంచార్జి నేతృత్వంలో నేతలు ప్రణాళిక ప్రకారం జనసమీకరణ చేశారు. బాపట్లలో మూడు దశబ్దాలుగా టీడీపీ ప్రతిపక్ష పాత్రకే పరిమితం అవటంతో చంద్రబాబు ప్రసంగం ఏ స్థాయిలో ఉంటుందో అని రాజకీయ వర్గాల్లో ఆసక్తి మొదలైంది. జిల్లాలో టీడీపీ క్లీన్‌స్వీప్ చేయాలంటే జిల్లా కేంద్రంలో ఖచ్చితంగా విజయం సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యేపై పలు అవినీతి ఆరోపణలు ఇటీవల వస్తున్న నేపథ్యంలో ఆ దిశగా చంద్రబాబు ప్రసంగం ఉండబోతుందని విస్వసనీయ సమాచారం. పార్టీ కేడర్ మొత్తం ఆసక్తిగా చంద్రబాబు రాక కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు పోలీసులు బహిరంగ సభ, రోడ్‌షోకు ఎలాంటి అవాంతరాలు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.బహిరంగ సభ అనంతరం చంద్రబాబు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస చేయనున్నారు.

## చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

**- పిలుపునిచ్చిన వేగేశన నరేంద్రవర్మ**

విశాలాంధ్ర - బాపట్ల : నేడు బాపట్లలో చంద్రబాబు పర్యటనను విజయ వంతం చేయాలని పార్టీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ పిలుపు నిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో వర్మ విలేకర్లతో మాట్లాడారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పేరుతో వైసీపీ పాలన వైఫల్యాలపై తెలుగుదేశం పార్టీ నిరసన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగా నేడు బాపట్ల పట్టణంలో చీలు రోడ్డు నుండి భారీ ర్యాలీలో అంబేద్కర్ సర్కిల్ వద్ద జరిగే బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడతారన్నారు. పర్యటనను విజయవంతం చేసేందుకు ఆహ్వాన కమిటీ, నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. అధికార పార్టీ ఎన్ని అడ్డుకుంలు సృష్టించిన నేడు అధినేత పర్యటన విజయవంతం కావటం ఖాయమని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వైసీపీ ప్రభుత్వానిక తగిన గుణపాఠం చెప్పటానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని వర్మ అన్నారు.

## వేల్పూరులో సమస్యలను పరిష్కరించాలని సీఎస్‌కు వినతి

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని వేల్పూరు గ్రామంలో నెలకొని యున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల బీజేపీ నాయకులు గట్టుపల్లి శ్రీనివాసరావు తాడేపల్లిలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో గురువారం కలసి వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వేల్పూరులో కోఎడ్యుకేషన్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని, వేల్పూరు నుంచి వెలమావారిపాలెం వెళ్ళే మార్గంలో రోడ్డుపై గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా మారిందని, ఈపూరు మార్కెట్ యార్డు నిధులతో వేల్పూరు నుంచి వెలమావారిపాలెంకు తారురోడ్డుకు అనుమతులు మజూరైనట్లు చెప్పడమే కానీ పనులు ప్రారంభం కాలేదని, పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను కోరినట్లు తెలిపారు. గ్రామంలో కొంతమందికి అన్ని అర్హతలు ఉన్నా ఫించన్లు, ఈబీసీ నేస్తం రావడం లేదని, పలుమార్లు దరఖాస్తులు చేసుకొన్నప్పటికీ అధికారులు తిరస్కరిస్తున్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీఎస్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

## దేశం మొత్తం ఒక సమగ్ర సైబర్ భద్రతా విధానం అమలు చేయాలి

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** దేశ రాజధాని ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్‌లోని సర్వర్లపై జరిగిన సైబర్ దాడి మనదేశ సైబర్ భద్రతా మార్గదర్శకాలను సమగ్రంగా పున:సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తి చేసిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది అగంతకులు జరిపిన 'రాన్సమ్ వేర్‌దాడి'తో కుప్పకూలిన సర్వర్లు పన్నెండు రోజులైనా ఇప్పటికీ బాగుకాలేదని, వీఐపీలు సహా లక్షలాది రోగుల వైద్య రికార్డుల సమాచారం గాలికిపోయిన ఎయిమ్స్ ఘటన దేశంలోని అతి పెద్ద సైబర్‌దాడి అని అన్నారు. డిజిటల్ ఇండియా పేరిట అన్ని రకాల ప్రభుత్వ విధులను ప్రజాసేవలను, నగదు సేవలను ఆన్‌లైన్‌లో జరపాలని ప్రోత్సహిస్తున్న వేళ ఈ పెద్ద సైబర్ దాడి జరిగిందని చెప్పారు. ఎయిమ్స్ ఘటన లాంటివి మరిన్ని జరగక ముందే సురక్షిత వ్యవస్థను ఆపద సమయంలో సమాచారాన్ని వెనక్కి రప్పించే పద్ధతులను సృష్టించుకోవటం తక్షణ కర్తవ్యమని ఈ ఎయిమ్స్ ఘటన నిరూపించిందని తెలిపారు.

## అగస్తేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.80లక్షలు

**విశాలాంధ్ర-తెనాలి :** మండలంలోని నందివెలుగు శ్రీ అగస్తేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగిందని దేవస్థాన ఈవో తమ్మా శివారెడ్డి తెలిపారు. గ్రేడ్ 1 ఆఫీసర్ చదలవాడ హనుమారెడ్డి పర్యవేక్షణలో గురువారం భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొని లెక్కించగా లక్షా ఎనభై నాలుగు వేల అయిదు వందల నలభై ఎనిమిది రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాస్థన ధర్మకర్తల ఛైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు, సభ్యులు ఎద్దు నాగేశ్వరరావు, మురికిపూడి రోజారాణి, రుద్రపాటి రామలక్ష్మీ, కట్టా రాజ్యలక్ష్మీ, అర్చకులు నందివెలుగు కుటుంబరావు, బుజ్జి, ఈశ్వరరావు, కిరణ్, శ్రీనివాసరాటవు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసంతో గెలిచిన 'ఆమ్ ఆద్మీ పార్టీ'

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** అతిపెద్ద కేంద్ర పాలిత ప్రాంతమైన ఢిల్లీలో 'ఆమ్ ఆద్మీ పార్టీ' తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని విశ్రాంత ప్రిన్సిపల్ ఎస్.రవిబాబు అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు'పై విశ్లేషణ కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఢిల్లీ స్థానిక ఎన్నికల్లో తొలిసారి 2007లో ఢిల్లీలో అధికారం చేజిక్కిచుకున్న బీజేపీని ఎలాగైనా బలహీనపరచాలని కాంగ్రెస్ 15ఏళ్ళుగా ఆపసోపాలు పడుతుంటే ఆప్ చాలా స్వల్పకాలంలో ఆ పనిని సునాయాసంగా పూర్తి చేసి లక్ష్యం ఉంటే సరిపోదని, అందుకు తగ్గ ఆచరణ, చిత్తశుద్ధి అవసరమని తేటతెల్లం చేసిందన్నారు. విశ్లేషకులు, విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు బీజేపీ ఏలుబడిలో ఉన్న ఢిల్లీ కార్పొరేషన్లో పేరుకుపోయిన చెత్తపై, అవినీతిపై, గుంతలు పడిన రోడ్డుపై రాజకీయ యుద్ధాలు చేయటంతో పాటు తాము అధికారంలోకి వస్తే వ్యర్థాల నిర్మూలనకు శాస్త్రీయ పరిష్కారం దక్కుతుందని, రోడ్లు చక్కగా ఉంటాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీని నమ్మి ప్రజలు ఓట్లు వేశారన్నారు. న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ముందు ఆప్‌ను అక్రమాల పుట్టగా ముద్రవేసేందుకు ప్రయత్నించినా ప్రజలు నమ్మలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో శివరామిరెడ్డి, సింగరయ్య, వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

### ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌ల

## భూ సేకరణ వేగవంతం

**విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) :** జిల్లాలో బహుళ ప్రయోజన కేంద్రాల (మల్టీ పర్పస్ ఫెసిలిటి సెంటర్స్) నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రాష్ట్ర సచివాయలం నుండి ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌ల భూసేకరణ, నిర్మాణం తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్‌లు, జేసీలతో రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ బాబు.ఏ గురువారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ డిల్లీరావు, జేసీ ఎస్.నూపూర్‌అజయ్ వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీ పర్పస్ ఫెసిలిటి సెంటర్స్ (ఎంపీఎఫ్‌సీ) గోడౌన్‌లకు సంబంధించి జిల్లాలో మొదటి విడత మంజూరైన 58 గోడౌన్‌ల నిర్మాణ పనులకు సంబంధించి 53 గోడౌన్‌ల పనులు శరవేగంగా జరుగుతున్నాయ న్నారు. ఎప్పటికప్పుడు సొసైటీలకు బిల్లులను పెండింగ్ లేకుండా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండవ విడతలో మంజూరైన 50 ఎంపీఎఫ్‌సీ గోడౌన్ల నిర్మాణాలకు 37 కేంద్రాలకు, మూడవ విడతలో మంజూరైన 21 గోడౌన్‌లకు 19 కేంద్రాలకు ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కో-అపరేటివ్ ఆఫీసర్ సీహెచ్.శైలజ, మార్కెటింగ్ ఏడీ కిషోర్ పాల్గొన్నారు.

## ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

**విశాలాంధ్ర-నందిగామ:** పీఎస్పీ బోస్ మెమోరియల్ ట్రస్ట్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని నందిగామ మండలం జడ్పీటీసీ నాదెల వెంకటేశ్వరరావు (బాబు), ఎంపీపీ అరిగెల సుందరమ్మ గురువారం మునగచర్లలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గాదెల వెంకటేశ్వర రావు (బాబు) మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి గ్రామీణ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు.ఉచిత శిక్షణ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకొని వారి కుటుంబాలను ఆర్థిక స్వావలంబన దిశగా వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం ప్రసాద్, హెచ్‌ఆర్ షేక్ సల్మా మరియు మేనేజర్ సుభాని, ట్రస్ట్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తం

**విశాలాంధ్ర-కోడూరు :** బంగాళాఖాతంలో ఏర్పడిన మాండోజ్ తూఫాన్‌తో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ హెచ్చరికలతో కోడూరు మండల రైతులు అప్రమత్తంగా ఉండాలని, కోడూరు మండల వ్యవసాయ అధికారులు గురువారం సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల వ్యవసాయ అధికారి భాను ప్రకాష్, అసిస్టెంట్ వ్యవసాయ అధికారి సురేష్ పాల్గొన్నారు.

# బీసీ సభలు పెట్టి బీసీలను మోసం చేస్తున్న పార్టీలు

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు క్రాంతికుమార్

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** రాజకీయ పార్టీలు ఆ పార్టీల స్వప్రయోజనాల కోసం బీసీ సభలు పెట్టి బీసీలను మోసం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ విమర్శించారు. గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల పెద్దలు కొన్నాళ్ళుగా బీసీల జపం చేస్తున్నారని, రాబోయే ఎన్నికలలో ఆ పార్టీకు బీసీలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బీసీలకు పనికిరాని బీసీ కార్పొరేషన్ పదవులు ఇచ్చి మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రతి బీసీ కులానికి ఒక కార్పొరేషన్ పెడతామని హామీ ఇచ్చి 139 బీసీ కులాల్లో కొన్నిటికి మాత్రమే కార్పొరేషన్ పెట్టి ఒక్క రూపాయి ఇవ్వలేదని, బీసీ వర్గాలకు బడ్జెట్‌లో లక్షల కోట్లు కేటాయించినట్లు సభలు పెట్టి ఉపన్యాసాలు ఇస్తున్న ప్రభుత్వాలు ఆ సభకు ఖర్చయ్యే నిధులలో సగం కూడా బీసీలకు నిధులు ఇవ్వలేదన్నారు. బీసీలే వెన్నెముక అంటున్న ప్రభుత్వం పనికిరాని కార్పొరేషన్ పదవులు ఇచ్చి మోసం చేస్తున్నారని, స్థానిక సంస్థలలో వారికున్న రిజర్వేషన్లు 34శాతం నుంచి 24 శాతానికి తగ్గించేశారని ఆరోపించారు. దీంతో 17వేల మంది బీసీలకు వారికి దక్కాల్సిన పదవులు దక్కలేదని, రాజకీయ పార్టీలు బీసీలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో 75సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలలో ఉన్న బీసీలు ఇప్పటికైనా పార్టీల జెండాలు మోయడం మాని బీసీలకు రావలసిన ఫలాలు మనకు దక్కేవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావుగారు, బీసీ నాయకులు పాపయ్య పాల్గొన్నారు.

## యోగా పోటీలకు బాలుడు ఎంపిక

**విశాలాంధ్ర-శావల్యాపురం :** రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు స్థానిక జడ్పీ పాఠశాలకు చెందిన ఓలీవా ఎంపికైనట్లు హెచ్ఎం పులిపాటి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 7వ తేదీన నకరికల్లు మండలం కండ్లకుంట జడ్పీ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో అండర్-17 యోగా విభాగంలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ముట్లూరి ఓలీవా అత్యున్నత ప్రతిభ కనబరచి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థి జనవరిలో చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొంటాడని తెలిపారు. ముట్లూరి ఓలీవాను పీఎంసీ చైర్మన్ ముట్లూరి ప్రసాదు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, రవికుమార్, కిషోర్, అబ్దుల్లా, నిర్మల, హబీ, సువర్చల, హలిమా, నాగమల్లేశ్వరి, సీఆర్పీ శివప్రసాద్ అభినందించారు.

## బీజేపీ కార్యకర్తల సంబరాలు

**విశాలాంధ్ర-వినుకొండ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ గుజరాత్ అసెంబ్లీలో 150 పైగా సీట్లు సాధించిన సందర్భంగా వినుకొండలో శివయ్య స్తూపం సెంటర్‌లో బీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి ప్రజలందరికీ మిఠాయిలు పంచి వాళ్ల సంతోషాన్ని ప్రజలతో పంచుకున్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి యార్లగడ్డ లెనిన్, పట్టణ అధ్యక్షులు ఆడిటర్ రాఘవులు, శావల్యాపురం మండల అధ్యక్షులు శివాది వెంకయ్య, నూజెండ్ల మండల అధ్యక్షులు జెడ్డా లక్ష్మీనారాయణ, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ఎండ్లూరి వీరయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి దేసు వెంకట లక్ష్మీనారాయణ, పట్టణ కోశాధికారి దేవతి చిన్న నరసింహారావు, శావల్యాపురం మండల ప్రధాన కార్యదర్శి పేరయ్య, వినుకొండ పట్టణ మాజీ అధ్యక్షులు బండి వెంకటేశ్వర్లు, గోనుగుంట్ల తులసి బాబు, భవనాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## రమేష్ బాబుకు ఘన సన్మానం

**విశాలాంధ్ర-వినుకొండ :** వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఎన్నికైన గద్దల రమేష్ బాబును జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వేనోమ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వేనోమ్, గాబ్రియల్ మాట్లాడుతూ దళితులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పదవుల పంపకంలో పెద్దపీట వేసిందని అన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు దళితులలో అనేకమందికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దళిత బహుజనులకు ఇంత పెద్ద గుర్తింపునిచ్చిన శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడును మరోసారి గెలిపించుకునేందుకు నియోజకవర్గంలోని దళితవాదులను ఐక్యం చేస్తామన్నారు. యార్డ్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ తనకు గుర్తింపునిచ్చిన శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్, 14వ వార్డు కౌన్సిలర్ జయరాజు, 12వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాట సత్యం, నాయకులు గద్దల సుమంత్, గద్దల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**విశాలాంధ్ర-నరసరావుపేట :** పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని 27 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.22.48 లక్షల సీఎం ఆర్థిక సహాయ నిధి చెక్కులను శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 3,254 జబ్బులను ఇవాళ ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకువచ్చి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదని అన్నారు. కాన్సర్ వంటి ప్రాణాంతకమైన జబ్బులకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్నారు. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.15 లక్షలు, చిన్న పిల్లల్లో వచ్చే కాక్ క్లియర్ ఇన్ప్లాంటేషన్ కోసం రూ.12 లక్షలు ఇస్తున్న ప్రభుత్వం ఇది అన్నారు. వైఎస్సార్ పేదల కోసం 1 అడుగు ముందుకు వేస్తే.. జగన్ 2 అడుగులు ముందుకు వేస్తున్నారు అని కొనియాడారు.

## ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయం

**విశాలాంధ్ర-రొంపిచర్ల :** ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక బీసీ కాలనీలో గల చర్చిలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమస్త మానవాళికి శాంతి సందేశమును ఇచ్చిన క్రీస్తు మహోన్నత దేవుడని కొనియాడారు. ప్రతిఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు ఆదరించాలని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు పాస్టర్లు జగన్ అధికారంలోకి రావాలని ప్రార్థనలు చేశారని ఆయన గుర్తుచేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ మరలా అధికారంలోకి వచ్చేందుకు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. వైసీపీ మరలా అధికారంలోకి రాకపోతే ఇప్పుడు ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని అన్నారు. పాస్టర్ల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం చర్చిలో సెమీక్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీజేబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ పడాల శివారెడ్డి, జడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, నాయకులు సుజాత పాల్, పాస్టర్లు పాల్గొన్నారు.

## స్వాములకు సద్ది ఏర్పాటు

**విశాలాంధ్ర-వినుకొండ :** వినుకొండ పట్టణంలో పాత శివాలయంలో 39వ రోజు సద్ది కార్యక్రమంలో భాగంగా గురువారం సద్ది ఏర్పాటు చేసిన వారు గంగవరపు శ్రీనివాసరావు ధర్మపత్ని శ్రీదేవి నూజెండ్ల మండలం గురప నాయుడుపాలెం సర్పంచ్ కుమారులు నవీన్ కుమార్ అఖిల్ కుమార్, మద్దినేని రమణయ్య ధర్మపత్ని నళిని కుమారుడు చేతన్, నందిత, మాల ధరించినటువంటి స్వాములకు సద్దిని ఏర్పాటు చేశారు. కోదండరామ స్వామి దేవాలయంలో పూజ అనంతరం దంపతులతో కలిసి స్వాములకు స్వయంగా వడ్డించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మాల ధరించిన స్వాములందరికీ సద్దిని ఏర్పాటు చేయటం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

## కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో గుడ్ షెఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

**విశాలాంధ్ర-వినుకొండ :** గుంటూరులో సీఎం కప్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వినుకొండ గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు మొత్తం 17 మంది పాల్గొని 17 పథకాలు సాధించారు. ఇందులో ఆరుగురు బంగారు పథకాలు మరొక ఆరుగురు రజిత, మరొక ఐదు కాంస్య పథకాలు సాధించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ జి.ఇన్నారెడ్డి పతకాలు సాధించిన వారికి అభినందన సభ ఏర్పాటు చేసి కరాటే క్రీడను ఉద్దేశించి మాట్లాడుతూ కరాటే క్రీడ పూర్వకాలంలో యుద్ధ కళగా ఉండేదని తెలియజేశారు. ఈ కరాటే క్రీడ సాధన చేస్తే మనోధైర్యం, ఆత్మస్థైర్యం పెంపొందించుకోవచ్చు అని తెలియజేశారు. ప్రస్తుత కాలంలో బాలికలకు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. శారీరక సామర్థ్యంతో పాటు మానసిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలియజేశారు. కరాటే సాధన చేస్తే ఒంటరితనం పిరికితనంను జయించవచ్చని అన్నారు. విద్యార్థులకి కచ్చితంగా ఉపయోగపడే క్రీడల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన క్రీడ అని తెలియజేశారు. చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. తమ పాఠశాలలో అన్ని రకముల క్రీడలుతో పాటు కరాటే, సంగీతం, క్లాసికల్ డాన్స్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.సునీత, కరాటే మాస్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న 'మక్కెన'

**విశాలాంధ్ర-వినుకొండ :** వినుకొండ పట్టణం కారంపూడి రోడ్డులో బాలాజీ టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

**విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ :** రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసి సంక్షేమాన్ని అభివృద్ధిని చేస్తున్న నేటి ప్రభుత్వాన్ని ప్రజలు చూస్తూనే ఉన్నారని మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ల రమేష్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశాల ప్రకారం గురువారం హుస్సేన్ నగరం, కాశిపాడు గ్రామాల్లో రెండు టీములుగా ప్రజల్లోకి వెళ్లి ప్రజా సంక్షేమం గురించి తెలుసుకున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జిలు పద్మముడి అప్పారావు, షేక్ అజుముల్లా, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, పాటిబండ్ల శివమ్మ రామ్‌గోపాల్ రావు, భాష్యం ఆంజనేయులు, మోదుగుల చంద్రశేఖర్, పాటిబండ్ల శివయ్య, మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాద్, మక్కెన సాగర్, నెల్లూరు మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ మరియదాసు, మాదిరాజు సీత తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

**విశాలాంధ్ర-మంగళగిరి :** నవజీవన్ బాల భవన్ విజయవాడ ఆధ్వర్యంలో మంగళగిరిలోని చింతక్రింది కనకయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రాజెక్టర్ ద్వారా గురువారం ఏర్పాటు చేశారు. ఈ అవగాహనా కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ అందమైన, విలువైన జీవితాన్ని మత్తు పథార్థాలతో దుర్భరం చేసుకోవద్దని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలు వదిలివేయండని అన్నారు. మత్తు పదార్థాలు అనేవి ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే అవగాహనతో తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలని అన్నారు. తెలిసో తెలియకో మత్తు పదార్థాల జోలికెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దు అని అన్నారు. మత్తుతో జీవితాలు చిత్తు అవుతాయన్నారు. మత్తు పదార్థాల వలన గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, ఊపిరితిత్తులపై ప్రభావం, శ్వాస కోశ సంభందించిన సమస్యలు ఏర్పడతాయని తెలియజేశారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణస్థితికి తీసుకురావచ్చని అన్నారు. ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడులో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కనకయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.రత్నబాబు, ఉపాధ్యాయులు కుమారప్ప, పీఈటీ టి.రవి, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో చంద్రబాబుకు ఘన స్వాగతం

**విశాలాంధ్ర-గుంటూరు :** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లా పర్యటనలో భాగంగా బుడంపాడు బైపాస్ వద్ద గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం నుంచి బుడంపాడు బైపాస్ వరకు 650 మందితో భారీ ఎత్తున నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించి ఘన స్వాగతం పలికారు.

**నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో:**

చంద్రబాబు పొన్నూరు పర్యటన సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి మహమ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విజ్ఞాన మందిరం వద్ద నుంచి బుడంపాడు పెట్రోల్ బంకు వరకు జరిగింది. కార్పొరేటర్లు, కార్పొరేటర్ అభ్యర్థులు, రాష్ట్ర, పార్లమెంటరీ, నగర పార్టీ నాయకులు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గం మహిళా విభాగం మహిళలు, గుంటూరు తూర్పు డివిజన్ ప్రెసిడెంట్, కార్యవర్గం, అనుబంధ విభాగం నాయకులు, గుంటూరు తూర్పు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**విశాలాంధ్ర-జగ్గయ్యపేట:** పట్టణంలోని మూడవ వార్డు పుట్ట బజార్‌లో రూ.10 లక్షలతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు గురువారం రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రామాల్లో పట్టణంలో తగిన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి ప్రజా సంక్షేమమే రెండుకళ్ళుగా మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, దానిలో భాగంగా పట్టణంలో రూపురేఖలను మార్చి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా మూడో వార్డు నందు పుట్టబజార్ నందు స్థానికులు శిధి లావస్థకు చేరుకున్న రోడ్డు సమస్య గురించి స్థానిక కౌన్సిలర్ కాశీ అనురాధ కిషోర్ కి తెలుపగా వారు ఆ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో స్పందించి నూతన రోడ్డు వేయించారన్నారు. నేడు ఆ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా దాదాపు 30 ఏళ్ల నుంచి రోడ్డు కొంత భాగం ప్రైవేట్ ల్యాండ్‌గా ఉండిపోవడంతో వారితో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు,మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, స్థానిక వార్డు కౌన్సిలర్ అనురాధ కిషోర్,పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), ఎస్టీ విభాగం అధ్యక్షులు బద్దు నాయక్,కౌన్సిలర్లు తన్నీరు నాగేంద్ర, పూసల పుల్లారావు, స్థానిక నాయ కులు పందిటి కోటేశ్వరరావు, షైక్ పెంటు, చిరంజీవి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.